క్లుప్తంగా

12న ఐటీఐలో జాబ్‌మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఈ నెల 12వ తేదీన కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఐటీఐ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల వర్మ మంగళవారం తెలిపారు. ప్రముఖ ఎల్అండ్‌టీ సంస్థతో పాటు వివిధ ప్రముఖ సంస్థలు 380 ఖాళీలు భర్తీ చేయడానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయని, ఐటీఐ ఫైనల్ విద్యార్థులు ఎలక్ట్రికల్, డ్రాఫ్ట్, సివిల్, మెకానిక్, టర్నర్, ఫిట్టర్, డీజిల్, వెల్డర్ విభాగాలకు చెందిన వారు హాజరుకావచ్చని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఉదయం 9 గంటలకు తమ విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

విద్యార్థులకు పాదరక్షల పంపిణీ



విద్యార్థులకు పాదరక్షలు పంపిణీ చేస్తున్న ఐడీఏ కన్వీనర్ సత్యనారాయణ

బోట్‌క్లబ్: స్థానిక నచికేత బాలుర హాస్టల్‌లోని పిల్లలకు ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పాదరక్షలు, సాక్స్‌లు పంపిణీ చేశారు. అసోసియేషన్ కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని ఇక్కడ బాలురలో సేవాభారతి సంస్థ ఎంతో చక్కగా ఇనుమడింపచేయడం అభినందనీయమని అన్నారు. ఇక్కడ ఉన్న పిల్లలందరికీ ధూళిపూడి రాజా సౌజన్యంతో పాదరక్షలు అందచేశామన్నారు. కార్యక్రమంలో కాకినాడ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్ర, వీవీ రావు, సిరాజ్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ భవనాన్ని త్వరగా పూర్తిచేయండి



కార్పొరేషన్ భవన నిర్మాణ ప్రగతిని ఎమ్మెల్యే కొండబాబుకు వివరిస్తున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: విశాల ప్రాంగణంలో నిర్మిస్తున్న కాకినాడ నగరపాలక సంస్థ నూతన భవనాన్ని వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) కోరారు. మంగళవారం ఆయన నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, ఇతర అధికారులతో కలిసి సినిమా రోడ్‌లో నిర్మిస్తున్న నూతన భవన ప్రాంగణాన్ని పరిశీలించారు. పనుల ప్రగతిని కమిషనర్ వెంకటరావు ఎమ్మెల్యే వనమాడికి వివరించారు. కమిషనర్ వెంకటరావు మాట్లాడుతూ స్మార్ట్ సిటీ ప్రాజెక్టును మార్చి 2025 వరకు పొడిగించారని, ఆ సమయంలోపు చాలా వరకు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు
కమిషనర్ వెంకటరావు

కాకినాడ: స్థానిక 43వ డివిజన్‌లోని తోట నరసింహం పార్కును నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు మంగళవారం తనిఖీ చేశారు. అక్కడ ఉన్న అనధికార వ్యాపారాలను సీజ్ చేసి, వాచ్ మెన్‌ను విధుల నుంచి తొలగించారు. పార్కులో అవకతవకలు జరిగాయంటూ స్థానిక జనసేన, టీడీపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఈ పి.సత్యకుమారి, ఇతర అధికారులతో కలిసి కమిషనర్ మంగళవారం క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. ప్రస్తుత వాచ్‌మెన్‌ను తొలగించి మరొకరిని నియమించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించేందుకు, సేద తీరేందుకు ఏర్పాటుచేసే పార్కుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా పార్కులను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఈఈ మాధవి, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్, అసిస్టెంట్ ఇంజినీర్ వై.నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

తప్పుడు ప్రచారంపై నిగ్గు తేల్చాలి

కాకినాడ రూరల్: తూరంగి గ్రామంలో ఆలయ భూమిని ఆన్యాక్రాంతం చేశారని తప్పుడు ప్రచారం సాగిస్తున్నారని, దీనిపై రెవెన్యూ అధికారులు నిగ్గు తేల్చాలని న్యాయవాది నరసింహం, రాఘవరాజు డిమాండ్ చేశారు. రమణయ్యపేటలో మంగళవారం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తూరంగి గ్రామంలోని సర్వే నంబరు 186/1లో 6.45 ఎకరాల భూమిని కుందూరి లక్ష్మీదేవి అనే ఆమె 1950లో కొనుగోలు చేశారని, తరువాత ఆమె ద్వారా విక్రయాలు జరిగాయన్నారు. అయితే తాము డెవలప్‌మెంట్‌కు తీసుకున్న భూమిలో రమణయ్యపేట విస్తాలయం 30 సెంట్లు ఉన్నట్టు ప్రచారం చేస్తున్నారని దీనిపై వాస్తవాలు గుర్తించేందుకు అప్పటి దస్తావేజులు ఆధారంగా విచారణ జరపాలన్నారు. దీనిపై కలెక్టరుకు ఫిర్యాదు చేస్తున్నామని, ఆలాగే తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

రేపటి ప్రగతి రథ సారథులు

- ఆర్టీసీలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ
- నిరుద్యోగులకు అండగా ఏపీఎస్ ఆర్టీసీ
- 18వ బ్యాచ్‌కు దరఖాస్తుల ఆహ్వానం



డ్రైవింగ్‌లో మెళకువలు చెప్తున్న ఎంవీఐ హరినాథరెడ్డి



శిక్షణ పొందుతున్న 17వ బ్యాచ్ అభ్యర్థులు

బాలాజీచెరువు: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ) అంటే ముందుగా గుర్తుకు వచ్చేది సురక్షితమైన, సుఖవంతమైన ప్రయాణం. ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సేవలోనే కాకుండా యువత బంగారు భవితకు సైతం బాటలు వేస్తోంది. ఆసక్తి గలవారికి హెవీ డ్రైవింగ్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2020లో అప్పటి జగన్‌మోహన్ రెడ్డి నిరుద్యోగ యువత భవిష్యత్‌కు భరోసా కల్పించేందుకు ఆర్టీసీ డ్రైవింగ్ స్కూళ్లు ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పార్లమెంట్ నియోజవకర్గాల్లో ఆర్టీసీ హెవీ వెహికల్‌లో డ్రైవింగ్ పాఠశాలలు ప్రారంభించారు. అందులో భాగంగా జిల్లా కేంద్రం కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో హెవీ డ్రైవింగ్ శిక్షణ కార్యాలయం ఏర్పాటుచేసి యువతీ యువకులకు బ్యాచ్‌లుగా ఏర్పాటు చేసి డ్రైవింగ్‌లో శిక్షణ, వాహన చట్టాల గురించి అవగాహన కల్పిస్తున్నారు. దీని కోసం నామమాత్రపు ఫీజు నిర్ణయించారు. శిక్షణ పూర్తి చేసే వారికి సర్టిఫికెట్‌తో పాటు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించి వారి జీవితానికి భరోసా కల్పిస్తున్నారు. ఇక్కడ డ్రైవింగ్ నేర్చుకుంటున్న అభ్యర్థులు భవిష్యత్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో డ్రైవర్లుగా స్థిరపడేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వ రంగాల్లో అయితే ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్లో శిక్షణ పొందిన వారికి ప్రాధాన్యం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకూ 17 బ్యాచ్‌లలో 250 మంది శిక్షణ పొందారు. ప్రస్తుతం 18 బ్యాచ్‌కు అధికారులు సిద్ధమై అభ్యర్థులను ఆహ్వానిస్తున్నారు.

18వ బ్యాచ్‌కు దరఖాస్తులు ఆహ్వానం



హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో అభ్యర్థులకు సుశిక్షితులైన నిపుణులతో శిక్షణ అందిస్తున్నాం. రాత్రివేళలో డ్రైవింగ్ నేర్పిస్తాము. సమయ పాలన, క్రమ శిక్షణ, అంకిత భావంతో డ్రైవింగ్‌లో మెళకువలు నేర్పుతూ రోజూ తరగతి గదిలో పాఠాలతో పాటు గ్యారేజీలో ఇంజిన్ భాగాలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం 18వ బ్యాచ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాము.

– ఎం.రామారావు, డ్రైవింగ్ స్కూల్ ఇన్‌స్పెక్టర్

హెవీ వెహికల్ లైసెన్స్‌కు శిక్షణ



బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ అభ్యసించి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నా. రవాణాశాఖ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి ప్రిపేర్ అవుతూ డ్రైవింగ్ శిక్షణతో పాటు లైసెన్స్ కోసం శిక్షణ పొందాను. డ్రైవింగ్‌కు సంబంధించి అన్ని విషయాలపై అవగాహన కలిగింది.

– పి.సూర్యతేజ, యానం

డ్రైవింగ్‌పై అవగాహన వచ్చింది



కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉద్యోగాలకు సంబంధించి డిఫెన్స్ వంటి వాటికి హెవీ లైసెన్స్ తప్పనిసరిగా అడుగుతున్నారు. డ్రైవింగ్‌తో పాటు లైసెన్స్ జారీకి ఆర్టీసీ అందిస్తున్న సేవలు వినియోగించుకున్నాను. ఇటువంటి వాటి ద్వారా నేర్చుకుంటే అవగాహన పూర్తిగా వస్తుంది.

–ఎ.నవీన్, కాకినాడ

వినాయక చిట్స్‌పై కేసు నమోదు

కాకినాడ క్రైం: కాకినాడ కేంద్రంగా చిట్‌ఫండ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న వినాయక చిట్స్‌పై కేసు నమోదు చేసినట్లు కాకినాడ టూటౌన్ సీఐ నాగేశ్వర్‌నాయక్ తెలిపారు. మంగళవారం కాకినాడ జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ ఎం.సుధారాణి ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. మెచ్యూరిటీ పూర్తి అయినప్పటికీ ఇవ్వాల్సిన సొమ్ము ఇవ్వలేదని పలువురు ఖాతాదారులు తమను ఆశ్రయించి ఫిర్యాదు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీస్ శాఖ బీఎన్ఎస్ 318(4), సెక్షన్ 5 ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ పరిధిలో కేసు నమోదు చేశారు.

రేపు వాహనాల విడి భాగాల వేలం

కాకినాడ క్రైం: జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న మోటార్ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో పోలీస్ వాహనాల మరమ్మతుల అనంతరం తీసివేసిన విడిభాగాల విక్రయానికి జిల్లా పోలీస్ శాఖ నిర్ణయించింది. ఇందుకు గురువారం ఉదయం 10 గంటల నుంచి వేలం పాట నిర్వహించనున్నట్లు మంగళవారం రాత్రి ఎస్పీ సతీష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న బిడ్డర్లు వేలం ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాల కోసం మోటార్ ట్రాన్స్‌పోర్టు అధికారిని 94407 96510 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి సాగాలి



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్, కార్యదర్శి తదితరులు

కరప: రాజకీయ విబేధాలకు తావు లేకుండా గ్రామాభివృద్ధికి నాయకులు, గ్రామస్తులు సహకరించాలని సర్పంచ్ రెడ్డిపల్లి వెంకటమాధవి కోరారు. మండలం పెనుగుదురులో మంగళవారం జరిగిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. గ్రామ కార్యదర్శి బి.చంద్రకళ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు తాగునీటి ట్యాంక్‌ను వారానికొకసారి శుభ్రం చేయించి, క్లోరినేషన్ తర్వాతనే తాగునీరు సరఫరా చేయనున్నామన్నారు. వీధులను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్య పనులు చేయిస్తున్నామన్నారు. జనన, మరణాల నమోదు గురించి, పంచాయతీ నిర్వహిస్తున్న విధులను కార్యదర్శి వివరించి, ప్రజలకు అవగాహన కల్పించారు. దేవస్థానం భూములకు సంబంధించి సమస్యను కొంతమంది లేవనెత్తగా దానికి గ్రామస్తులందరూ సమావేశమై ఏంచేయాలో సమిష్టిగా నిర్ణయం తీసుకుందామని వివిధ పార్టీల నాయకులు చెప్పడంతో దానికి అందరూ అంగీకరించారు. గ్రామసభ గురించి జనసేన పార్టీ నాయకులు కానీ, పంచాయతీ వారు కానీ చెప్పలేదని, కూటమి ప్రభుత్వం వచ్చినా గ్రామంలో టీడీపీ నాయకులను పట్టించుకోకపోవడం దారుణమని టీడీపీ మండల ఎస్సీ నాయకుడు పులప కూర మహేష్ ఆరోపించారు. మండల బీజేపీ అధ్యక్షుడు బండారు మురళి, బండారు వెంకటేశ్వరరావు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా భారతీయుడు–2 ప్రీ రిలీజ్ ఈవెంట్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సురేష్ ప్రొడక్షన్స్ ప్రాపర్టీ మేనేజర్ రమేష్

బోట్‌క్లబ్: స్థానిక ఆనంద్ థియేటర్ కాంప్లెక్స్‌లో మంగళవారం కమల్‌హాసన్ నటించిన భారతీయుడు–2 చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సురేష్ ప్రొడక్షన్స్ ప్రాపర్టీ మేనేజర్ పి.రమేష్ మాట్లాడుతూ ఈ సినిమా ఈ నెల 12 దేశ వ్యాప్తంగా రిలీజ్ అవుతుందన్నారు. 1996లో భారతీయుడు సినిమా విడుదలై దేశవ్యాప్తంగా సూపర్ హిట్ అయింది అన్నారు. అదే తరహాలో భారతీయుడు–2 సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించాలని కోరారు. అనంతరం అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సురేష్ ప్రొడక్షన్స్ ప్రతినిధులు పి.శ్రీనివాస్, నారాయణరావు, శంకర్, బాలు అభిమానులు పాల్గొన్నారు.

తూరంగిని నగరంలో కలపాలి



సమావేశంలో మాట్లాడుతున్న సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు

కాకినాడ సిటీ: గత 13 ఏళ్లుగా తూరంగి గ్రామాన్ని పంచాయతీ రాజ్ నుంచి వేరు చేసి అర్బన్ పరిధిలోకి తెచ్చి కాకినాడ నగరపాలక సంస్థలో విలీనం చేయకపోవడం వల్ల ప్రజలు అనేక అగచాట్లు పడుతున్నారని ఆ గ్రామ పౌరసంఘ సమావేశం పేర్కొంది. మంగళవారం రాత్రి తూరంగి జయప్రకాష్‌నగర్‌లో విశ్రాంత అధ్యాపకుడు జోగా అప్పారావు గృహంలో ఏర్పాటు చేసిన పౌరసంఘ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొని మాట్లాడారు. తూరంగి విలీనంపై హైకోర్టులో ఉన్న స్టే తొలగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా తూరంగి అభ్యున్నతి కోరుతూ కాకినాడ అర్బన్ గ్రామాల విలీన సాధన సమితి ఏర్పాటుకు భాగస్వామ్యం కావాలని సమావేశం నిర్ణయించింది. తూరంగిలో నెలకొన్న అవస్థలను తెలియజేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్, మున్సిపల్ మంత్రి పి.నారాయణ హైకోర్టు ధర్మాసనానికి రిజిస్టర్ లేఖలు పంపించి, కలెక్టర్ షాన్ మోహన్, రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ)కి వినతి పత్రం అందించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో పౌర సంక్షేమ సంఘం నాయకులు చింతపల్లి అజయ్‌కుమార్, సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు, తిరుమాని స్వామినాయకర్, డి.నాగబాబు, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, కె.తాతబ్బాయి, కక్కల దుర్గ, జె.వసుంధర, తట్టవర్తి సుబ్బారావు, కె.నర్సింహామూర్తి, చంద్రశేఖర్, ఎన్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

కాకినాడ సిటీ: కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఏ రంగంలో కార్మికులకైనా కనీస వేతం రూ.26 వేలు అమలు చేయాలని సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి పిలుపు నిచ్చారు. మంగళవారం సాయంత్రం కాకినాడ యూటీఎఫ్ హోంలో నగర సీఐటీయూ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్మిక హక్కుల విషయంలో కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తూ, నిరంతరం కార్పొరేట్ల కొమ్ము కాస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో నూతనంగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం కనీస వేతనాలు సవరించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. స్కీం వర్కర్స్ వంటి చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు అరికట్టాలన్నారు. నగరంలో కొత్త రంగాలకు విస్తరించి సీఐటీయూను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర సీఐటీయూ నూతన సమన్వయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా మలక వెంకటరమణను, సహాయ కన్వీనర్లుగా పలివెల వీరబాబు, దుంపల ప్రసాద్, ఎం రమణమ్మ, ఎంకే జ్యోతి, భారతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా 18 తీర్మానాలను ఆమోదించారు.

చురుగ్గా కోనోకార్పస్ చెట్ల తొలగింపు

- పర్యవేక్షించిన కమిషనర్, డీఎఫ్ఓ
- మొదట పార్కుల్లో.. దశల వారీగా పాఠశాలల్లోనూ తొలగింపు



పార్కును సందర్శించిన కమిషనర్ వెంకటరావు

కాకినాడ: పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హాని కలిగించే కోనోకార్పస్ చెట్ల తొలగింపు ప్రక్రియ వేగవంతం చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, జిల్లా అటవీ శాఖాధికారి ఎస్.భరణి చెప్పారు. మంగళవారం కమిషనర్, డీఎఫ్ఓలు జన్మభూమి పార్క్, బోట్ క్లబ్ పార్కులను సందర్శించారు. ఇటీవల కలెక్టర్ షాన్ మోహన్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఆ చెట్ల తొలగింపు వేగవంతం చేయడంతో పాటు, ప్రత్యామ్నాయ చర్యలను ఇద్దరు అధికారులు పర్యవేక్షించారు. తొలుత జన్మభూమి పార్క్‌ను, ఆ తర్వాత బోట్ క్లబ్ పార్క్‌ను అధికారులు సందర్శించారు. కాకినాడలోని వివిధ పార్కుల్లో ఈ చెట్లు సుమారు 500 ఉండగా ఒక్క బోట్ క్లబ్ పార్క్‌లోనే 100 ఉన్నాయి. వీటిని తొలగిస్తున్న విధానాన్ని పర్యవేక్షించి ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీటి స్థానంలో టబూబియా బాటిల్ బ్రష్, వెదురు వంటి మొక్కలను నాటే అంశంపై చర్చించారు. కళాశాలలు, పాఠశాలల్లో కూడా వీటిని దశలవారీగా తొలగిస్తామన్నారు.

ఆరోగ్యకారక మొక్కలు నాటాలి
జిల్లా అటవీ శాఖ అధికారి భరణి



రమణయ్యపేటలోని బోట్‌క్లబ్ పార్కును పరిశీలిస్తున్న జిల్లా అటవీ శాఖ అధికారి భరణి

కాకినాడ రూరల్: పార్కుల్లో సందర్శకుల ఆరోగ్యం పెంచే దిశగా ఆరోగ్యకరమైన మొక్కలు పెంచాల్సి ఉందని జిల్లా అటవీ శాఖ అధికారి భరణి పేర్కొన్నారు. కాకినాడ 1వ డివిజన్ పరిధిలోని రమణయ్యపేట బోట్‌క్లబ్ పార్కును మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తదితరులతో ఆమె సందర్శించారు. పార్కులో ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పెంచాల్సిన మొక్కల గురించి వారు చర్చించారు. భరణి మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతకు మొక్కలు దోహదపడతాయన్నారు. మొక్కల వల్ల ఆక్సిజన్ శాతం పెరిగి కాలుష్యం తగ్గుతుందన్నారు. ఉద్యానవనాలలో కాలుష్య కారక మొక్కలు వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. వాటిని తొలగించి వాటి స్థానే ఆరోగ్యాన్ని ఇచ్చే మొక్కలు నాటేందుకు అటవీ శాఖ సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో అటవీ, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రాక్ సిరామిక్స్ ఉద్యోగులు

కాకినాడ సిటీ: ఎన్నికల ముందు రాక్ సిరామిక్స్ సామర్లకోట టైల్స్ పరిశ్రమలో ఏ కారణమూ లేకుండా తొలగించిన 24 మంది పర్మినెంట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. యూనియన్ నాయకులు చెక్కల రాజ్‌కుమార్, దారపురెడ్డి క్రాంతి, మలకా రమణ, రాక్ సిరామిక్ ఉద్యోగి చంద్రశేఖర్ మాట్లాడారు. ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా 18 ఏళ్ల నుంచి పని చేస్తున్న కార్మికులను అకారణంగా తొలగించి 24 కార్మికుల కుటుంబాలను రోడ్డున పడేశారని విమర్శించారు. కార్మిక శాఖ మొద్దు నిద్రపోతూ అన్యాయంగా, చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవడం మానేసి కార్మికులకు సెటిల్మెంట్ చేసుకోమని ఉచిత సలహాలు ఇవ్వడం మానుకోవాలన్నారు. షేర్ మార్కెట్లో రాక్ సిరామిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వాటాదారులకు లాభాలు పంచుతూ, కార్మికులకు మాత్రం నష్టాలు వస్తున్నాయన్నారు. 85 రోజుల నుంచి ఆందోళన చేస్తున్నా యాజమాన్యం స్పందించకపోవడం అన్యాయమన్నారు. అనంతరం ఆందోళనకారులు కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో రాక్ సిరామిక్స్ ఉద్యోగులు రామకృష్ణ, అర్జునరావు, జీవీ మల్లికార్జునరావు, కాళ్ల మంగారావు, సుబ్బారావు, బి.ప్రభుదాస్, రాజబాబు, ఏవీ సత్యనారాయణ, బీఎస్ఆర్ మూర్తి, గంగాధర్ జీవీవీ సత్యనారాయణ, రామచంద్రయ్య, క్రాంతి, ఎం.రామకృష్ణ, ఎస్ సతీష్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక శాఖా మంత్రికి ఎమ్మెల్సీ లేఖ

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్ కంపెనీలో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు (ఐవీ) రాష్ట్ర కార్మికశాఖ మంత్రికి లేఖ రాసి ఫోన్‌లో మాట్లాడారు. ఈ మేరకు ఆ లేఖను రాక్ సిరామిక్స్‌లో తొలగించిన కార్మికులు స్థానిక విలేకర్లకు విడుదల చేశారు. 24 మంది కార్మికులను గత ఏప్రిల్ 15న విధుల నుంచి తొలగించారన్నారు. జాయింట్ లేబర్ కమిషనర్ వద్ద నాలుగు పర్యాయాలు చర్చలు జరిగినా వారికి న్యాయం జరుగలేదన్నారు. కార్మికులను విధుల్లోకి తీసుకునేలా ఫ్యాక్టరీ యజమాన్యంతో సంప్రదించి చట్ట ప్రకారం చర్యలు తీసుకొవాలని మంత్రి సుభాష్‌ను ఎమ్మెల్సీ కోరారు.

పరిహారం ఎక్కడ..?

- వేట నిషేధ సమయం ముగిసినా అందని పరిహారం
- పట్టించుకోని ప్రభుత్వం
- లభించని ప్రోత్సాహకం
- మత్స్యకారులకు తప్పని ఇబ్బందులు



వేట నిషేధ సమయంలో రామన్నపాలెం ఉప్పుటేరు వద్ద నిలిపిన బోట్లు

కొత్తపల్లి: సముద్రంలో మత్స్య సంపద వృద్ధి చెందేందుకు ప్రభుత్వం రెండు నెలల పాటు వేట నిషేధం అమలు చేసింది. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ అర్ధరాత్రి వరకూ వేట నిషేధ సమయం ఉంటుంది. ఈ సమయంలో చేపల వేట లేకపోవడంతో మత్స్యకారులు ఆర్థికంగా ఇబ్బంది పడే అవకాశం ఉంది.

గంగపుత్రులు ఎలాంటి ఇబ్బంది పడకూడదని ఉద్దేశంతో ప్రభుత్వం పరిహారాన్ని అందిస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వేట నిషేధ పరిహారాన్ని ముఖ్యమంత్రి మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయిత సమయంలోనే అందించారు. అర్హులైన ప్రతి మత్స్యకారుడికి రూ.10వేలను వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేశారు. వేట నిషేధ సమయం ప్రారంభంలోనే అధికారులు బోట్లు రిజిస్ట్రేషన్లను తనిఖీ చేసి అర్హులను గుర్తించి వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసేవారు. అయితే ఈ ఏడాది వేట నిషేధం పూర్తయినా ఇప్పటి వరకూ పరిహారం అందకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

రూ.20 వేలు ప్రకటించారు

కూటమి పార్టీలు అధికారంలోకి వస్తే వేట నిషేధ సమయంలో అర్హులైన మత్స్యకారులకు రూ.20 వేలను పరిహారం అందిస్తామని ఎన్నికల ముందు ప్రకటించింది. అనుకున్నట్టుగానే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట మరిచింది. వేట నిషేధం పూర్తయి సుమారు 25 రోజులు గడుస్తున్నా పరిహారాన్ని అందించలేదు.

గత ప్రభుత్వంలో లబ్ధి పొందిన వారి వివరాలు

సంవత్సరం	వైఎస్సార్ మత్స్యకార భరోసా లబ్ధిదారులు	బోట్లు
2018–19	4825	886
2019–20	4977	906
2020–21	5324	956
2021–22	4665	886
2022–23	5285	961

నాణ్యమైన ఎరువులనే విక్రయించాలి

సామర్లకోట: రైతులకు కావలసిన ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించే లక్ష్యంతో అధికారులు ఆయా ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వం నియమించిన స్పెషల్ స్క్వాడ్ మంగళవారం మండల పరిధిలోని వేట్లపాలెం సత్యసాయి ఎజెన్సీస్‌కు చెందిన ఎరువుల దుకాణంలో తనిఖీ చేసింది. ఎరువులు, పురుగు మందుల నిల్వ రిజస్టర్లు, బిల్లులు, నిల్వలను పరిశీలించారు. ఈ మేరకు ఐఎస్ఐ మార్కు కలిగిన నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు మాత్రమే రైతులకు విక్రయించాలని తనిఖీ బృందంలోని శ్రీకాకుళం జిల్లా డీడీఏ కె.త్రినాథస్వామి సూచించారు. రైతులకు ఎరువులు, పురుగు మందులు విక్రయించిన సమయంలో బిల్లులు తప్పని సరిగా ఇవ్వాలన్నారు. బిల్లులకు, ఎంఆర్‌పీలకు వ్యత్యాసం లేకుండా చూడాలని తెలిపారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదుల వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువులను డీబీటీ పద్ధతిలోనే విక్రయించాలని చెప్పారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు ఉంటాయన్నారు. జిల్లా వ్యవసాయశాఖ టెక్నికల్ అధికారి డీవీవీ సతీష్, ఏఓలు విజయలక్ష్మి, ఐ.సత్య పాల్గొన్నారు.